# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-09-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రపంచవ్యాప్తంగా 20 శాతం సెమీ కండక్టర్ల రూపకల్పన భారత్ నుంచే జరుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.**
2. **ఉద్యాన పంటలకు సాగు ఖర్చుల ప్రకారం ధర కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
3. **మాదక ద్రవ్య రహిత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హోంశాఖ మంత్రి వి.అనిత పేర్కొన్నారు.**
4. **ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ వెల్లడించారు.**
5. **రాష్ట్ర ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కోరారు.**

==========================

ప్రపంచవ్యాప్తంగా 20 శాతం సెమీ కండక్టర్ల రూపకల్పన భారత్ నుంచే జరుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఢిల్లీలోని యశో భూమిలో నిర్వహించిన సెమికాన్ ఇండియా 2025 సదస్సును ప్రధానమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశ స్థూల జాతీయోత్పత్తిలో మెరుగైన వృద్ధిని సాధించామని తెలిపారు. సెమీ కండక్టర్ల పరిశ్రమలకు, అంకుర సంస్థలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోందని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ 36 సెకన్లు

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఉద్యానవన శాఖ, మార్కెటింగ్ శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఉద్యాన పంటలకు సాగు ఖర్చుల ప్రకారం మద్దతు ధర కల్పించాలన్నారు. రాష్ట్రంలో ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు వెళ్ళకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు రసాయన ఎరువులను, క్రిమిసంహారకాల వినియోగాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ –సీఆర్డీఏపై సమీక్ష నిర్వహిస్తున్నారు. కాగా...

సాయంత్రం విశాఖపట్నం గ్లోబల్ ఫోరం ఫర్ సస్టెయినబుల్ ట్రాన్స ఫర్మేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈస్ట్ కోస్ట్ మారిటైమ్ అండ్ లాజిస్టిక్స్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి పాల్గొంటారు.

---------------------------

మాదక ద్రవ్య రహిత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హోంశాఖ మంత్రి వి.అనిత తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి ఆరో బెటాలియన్ ప్రాంగణంలో 22వ బ్యాచ్ పోలీస్ జాగిలాల పాసింగ్ అవుట్ పరేడ్ ఈరోజు జరిగింది. ఈ కార్యక్రమంలో హోం మంత్రి, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోలీసు జాగిలాల ప్రదర్శన, విన్యాసాలను వీక్షించారు. అనంతరం మంత్రి అనిత మాట్లాడుతూ, రక్షణలో కీలకంగా వ్యవహరించే పోలీసు శాఖ మరింత అప్రమత్తంగా పని చేస్తోందన్నారు. నేర పరిశోధనలో పోలీసు జాగిలాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆమె పేర్కొంటూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి ఈరోజు. ఈ సందర్భంగా రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ ప్రజలు ఘనంగా నివాళులర్పిస్తున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి వైఎస్ఆర్ కడప జిల్లా ఇడుపులపాయలో వైఎస్ఆర్ ఘాట్ వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొని నివాళులు అర్పించారు.

---------------------------

రాష్ట్రంలో 67 పంచాయతీల్లో అన్న క్యాంటీన్లు సహా వాటికి కొత్త భవనాలను ప్రభుత్వం మంజూరు చేసిందని రాష్ట్ర పేదరిక నిర్మూలనా శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరం జిల్లా గజపతినగరం ప్రాంతీయ ఆసుపత్రి సమీపంలో 61 లక్షల రూపాయలతో నిర్మాణం చేపట్టనున్న అన్న క్యాంటీన్ భవనానికి మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో అన్న క్యాంటీన్లు కేవలం పురపాలక పట్టణాలల్లోనే ఉండేవని, ఇప్పుడు జిల్లాల్లో రద్దీగా ఉండే పెద్ద పంచాయతీల్లోనూ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో గజపతినగరం, కొత్తవలస, చీపురుపల్లిలోనూ క్యాంటీన్లు అందుబాటులోకి వస్తాయని మంత్రి తెలిపారు.

---------------------------

ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. నెల్లూరులో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి నిన్న లబ్ధిదారులకు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ, వైద్యానికి ఆర్థికస్తోమత లేని వారు సాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్ 29సెకన్లు

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కోరారు. వైయస్సార్ కడప జిల్లా పులివెందులలో పర్యటిస్తున్న ఆయన ఈరోజు తాళ్లపల్లిలో ఉల్లి, నారింజ రైతులుతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం

జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదని చెప్పారు. రైతులకు ఎరువులను అందజేయటంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల చోటు చేసుకుంటున్న విద్యుత్ ప్రమాదాలపై ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈరోజు సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో విద్యుత్ భద్రతా అధికారులతో ప్రమాదాల నివారణ చర్యలపై సమీక్షిస్తున్నారు. అనంతరం ఏపీ జెన్‌కో ఉన్నతాధికారులతో జరిగే సమావేశంలో విద్యుత్ వినియోగం, డిమాండ్‌కు సరిపడా విద్యుత్ ఉత్పత్తి పరిస్థితులపై సమీక్ష జరుపుతారు.

---------------------------

వాయువ్య బంగాళాఖాతంలో ఈరోజు అల్పపీడనం ఏర్పడిందని, రాబోయే 24 గంటల్లో ఇది మరింత బలపడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని కోస్తాజిల్లాల్లో ఈరోజు మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగిలిన చోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేస్తూ...

వాయిస్..22 సెకన్లు

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు లాభాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 352 పాయింట్ల లాభంతో 80 వేల 715 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 113 పాయింట్ల లాభంతో 24 వేల 738 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

మత్స్యరంగంలో ఉపాధి అవకాశాల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిన్న నిర్వహించారు. ఈ సమావేశంలో సముద్రపు నాచు సాగు, పీతల సాగు, మెరైన్ ఫిష్ కేజ్ కల్చర్, మడ అడవుల పెంపకం సంరక్షణకు చేపట్టవలసిన కార్యచరణపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నాగాయలంక, కోడూరు, కృత్తివెన్ను వంటి తీరప్రాంత మండలాలు పీతల సాగుకు అనువైన ప్రాంతాలని, అందుకు సాధ్యసాధ్యాలను పరిశీలించాలన్నారు. మడ అడవుల పెంపకానికి ఇంతేరు, బంటుమిల్లి ప్రాంతాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

---------------------------

రాష్ట్రంలో డీఎస్సీకి సంబంధించిన రెండో విడత ధృవపత్రాల పరిశీలన ఈరోజు నిర్వహిస్తున్నామని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. మొదటి విడత సర్టిఫికెట్ల పరిశీలనలో తిరస్కరణకు గురైన వారి స్థానంలో కొత్తవారికి కాల్ లెటర్లు విడుదల చేయనుంది. ఈ మధ్యాహ్నం నుంచి రేపటి వరకు సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టనున్నామని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో డీఎస్సీకి సంబంధించిన రెండో విడత ధృవపత్రాల పరిశీలన ఈరోజు నిర్వహిస్తున్నామని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. మొదటి విడత సర్టిఫికెట్ల పరిశీలనలో తిరస్కరణకు గురైన వారి స్థానంలో కొత్తవారికి కాల్ లెటర్లు విడుదల చేయనుంది. ఈ మధ్యాహ్నం నుంచి రేపటి వరకు సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టనున్నామని అధికారులు తెలిపారు.

=====================